సాక్షి
సూర్యాపేట
శుక్రవారం । 21 । జూన్ । 2024



ఆరోగ్య సూత్రం..
యోగా సాధన ఆరోగ్య సూత్రంగా మారింది. నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.
- 8లో



ప్రజలే నిర్ణయిస్తారు
ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందం విషయంలో తప్పు ఎవరిదో ప్రజలే నిర్ణయిస్తారని ఎంపీ రఘువీర్‌రెడ్డి అన్నారు.
- 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
36° / 27°
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జూనియర్ కాలేజీల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

నడిగూడెం : జూనియర్ కాలేజీల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జానపాటి కృష్ణయ్య కోరారు. గురువారం నడిగూడెం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేసి, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ప్రిన్స్‌పాల్ పిచ్చిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు .

మట్టపల్లిలో నిత్యకల్యాణం



తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో గురువారం విశేషంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. కల్యాణవేదుకలో భాగంగా విష్వక్సేనారాధన , రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు పూర్తిగావించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రవేశానంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు క్రిష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహ మూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

సూర్యాపేటటౌన్ : పోలీస్ సిబ్బంది చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు సూచించారు. గురువారం సూర్యాపేట పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో నూతన చట్టాలపై పోలీస్ సిబ్బందికి ఇచ్చిన శిక్షణలో ఆయన మాట్లాడారు. చట్టాలపై అవగాహన ఉంటే కోర్టుల్లో కూడా కేసులను సులభంగా గెలవవచ్చని అదనపు ఎస్పీ పేర్కొన్నారు.

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి



డీఈఓకు వినతి పత్రం అందజేస్తున్న పీడీఎస్‌ఎఫ్ నాయకులు

సూర్యాపేటటౌన్ : ప్రభుత్వ నిబంధనలు పాటించని, అనుమతులు లేకుండా నడిపిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్(పీడీఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో డీఈఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌ఎఫ్ నాయకులు ఎం.వినయ్‌కుమార్, ఎస్.నవీన్, ఉదయ్, అరుణ్ పాల్గొన్నారు.

పారాఫిట్ దీపాల పునరుద్ధరణ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలోని పారాఫిట్ వాల్‌పై విద్యుత్ దీపాల పునరుద్ధరణకు దేవస్థానం అధికారులు చర్యలు చేపట్టారు. యాదాద్రి ఆలయ పునర్నిర్మాణ సమయంలో కోట్ల రూపాయలు వెచ్చించి ఆకర్షణీయమైన విద్యుత్ దీపాలు కొనుగోలు చేసి పారాఫిట్ వాల్‌పై ఏర్పాటు చేశారు. కాగా నిర్వహణ లేక రెండేళ్లకే మూలనపడ్డాయి. దీనిపై 'మూలన పడ్డ పారాఫిట్ లైట్లు' శీర్షికతో గురువారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పాడైపోయిన విద్యుత్ దీపాలను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. ఎలక్ట్రీషియన్లు కొన్ని లైట్లను బిగించారు. మిగతావి త్వరలో వినియోగంలోకి తెస్తామని అధికారులు తెలిపారు.

23న తొట్ల మల్సూర్ జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ



మాట్లాడుతున్న కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

పెన్‌పహాడ్: ఈనెల 23న నూతనకల్‌లో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు తొట్ల మల్సూర్ జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ సభ ఉంటుందని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం పెన్‌పహాడ్ లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతనకల్ సాయిరాం ఫంక్షన్ హాల్‌లో జరిగే ఈ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి మడ్డి అంజిబాబుగౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు అబ్బగాని భిక్షం, తుమ్మల సైదయ్య, జిల్లా సహాయ కార్యదర్శి ఉయ్యాల నగేష్, పులుసు సత్యం, శిగ వెంకన్న, శ్రీను, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో నులి పురుగుల నివారణ



విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న డీఎంహెచ్‌ఓ కోటాచలం

సూర్యాపేట: వ్యక్తిగత పరిశుభ్రతతో పిల్లల్లో నులిపురుగులను నివారించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కోటాచలం సూచించారు. గురువారం సూర్యాపేట మండలం బాలెంల ప్రభుత్వ గురుకుల కళాశాలలో నిర్వహించిన జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లలు ఆల్బెండజోల్ మాత్ర మింగితే కడుపులో ఉన్న నట్టలు చనిపోతాయన్నారు. విద్యార్థులు భోజనానికి ముందు మలవిసర్జన తర్వాత చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ పి. వెంకటరమణ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శైలజ, శమంతకమణి, మెడికల్ ఆఫీసర్ స్రవంతి, మణికంఠ, అంజయ్యగౌడ్, కిరణ్, ఆకుల సతీష్ పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లు డీలా..

- సంప్రదాయ కోర్సుల్లో చేరడానికి విద్యార్థుల విముఖత
- మొత్తం 24,000 సీట్లకు నిండినవి 3,690 మాత్రమే
- 16 శాతం కూడా దాటని అడ్మిషన్లు
- రెండు విడతల్లోనూ కానరాని పురోగతి
- ఆశలన్నీ ఇక చివరి దశ కౌన్సిలింగ్‌పైనే..



ఇది కోదాడలోని కేఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల. దాదాపు ఆరు దశాబ్దాల చరిత్ర ఉన్న ఈ కళాశాలలో గతంలో డిగ్రీ సీటు కావాలంటే మంత్రుల స్థాయిలో పైరవీలు చేయించినా దొరకని పరిస్థితి ఉండేది. అన్ని హంగులున్న ఈ కళాశాలలో డిగ్రీ స్థాయిలో 420 సీట్లు ఉండగా ఈ విద్యాసంవత్సరం దోస్త్ మొదటి విడతలో 28 మంది, రెండో విడతలో 30 మంది విద్యార్థులు మాత్రమే చేరారు. అధ్యాపకులు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి తమ కళాశాలలో చేరాలని విద్యార్థులను వేడుకుంటున్నారు.

కోదాడ : డిగ్రీ కాలేజీల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. డిగ్రీ సంప్రదాయ కోర్సుల్లో అడ్మిషన్ తీసుకునేందుకు విద్యార్థులు అంతగా ఆసక్తిచూపడంలేదు. ఒకప్పుడు విద్యార్థులతో కళకళలాడిన ఈ



కోదాడలో ప్రచారం నిర్వహిస్తున్న కేఆర్ఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు

కాలేజీలు నేడు వెలవెలబోయే పరిస్థితులు నెలకొన్నాయి. రెండు విడతల్లో దోస్త్ ద్వారా ప్రవేశాల ప్రక్రియ నిర్వహించినా 16 శాతం కూడా అడ్మిషన్లు దాటలేదు.

10 కాలేజీల్లో అడ్మిషన్లు నిల్

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో 62 ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ డిగ్రీ కళాశాలు ఉన్నాయి. వీటి పరిధిలో వివిధ కోర్సులకు సంబంధించిన 24,000 సీట్లు ఉన్నాయి. వీటిలో 2024-25 విద్యాసంవత్సరానికి గాను డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ(దోస్త్) ద్వారా గత నెల 6 నుంచి ప్రభుత్వం అడ్మిషన్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టింది.ఇప్పటి వరకు నిర్వహించిన రెండు విడతల కౌన్సిలింగ్‌లో 3,699 మంది మాత్రమే అడ్మిషన్లు తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 10కి పైగా కళాశాలల్లో ఒక్కరూ కూడా చేరలేదు. 20 కళాశాలల్లో 10 మంది కన్నా తక్కువ మంది విద్యార్థులు చేరారరు. మూడు కళాశాలల్లో మాత్రమే మూడంకెల స్థాయిలో విద్యార్థులు చేరారు. ఆయా కాలేజీలు ఇక మూడో విడత కౌన్సిలింగ్‌పై ఆశలు పెట్టుకున్నాయి. ఇంటర్ సప్లిమెంటరీ రిజల్ట్స్ వస్తే మూడో విడతలో విద్యార్థుల చేరుతారని భావిస్తున్నారు.

మూడో విడతలో చేరే అవకాశం



దోస్త్ ద్వారా నిర్వహించిన రెండు విడతల కౌన్సిలింగ్ లో ఎంజీయూ పరిధిలో ఉన్న డిగ్రీ కళాశాలల్లో తక్కువ సంఖ్యలో విద్యార్థులు చేరారు. ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి కోర్సుల్లో అడ్మిషన్లు పూర్తికాకపోవడం, ఇంటర్ సప్లిమెంటరీ రిజల్ట్స్ రాకపోవడంతో తక్కువ మంది విద్యార్థులు డిగ్రీలో చేరారు. మూడవ విడతలో ఆశించిన స్థాయిలో విద్యార్థులు డిగ్రీ కోర్సుల్లో చేరే అవకాశం ఉంది.

– డాక్టర్ ఎ. రవి, దోస్త్, కోఆర్డినేటర్, ఎంజీయూ

ఆదరణ కోల్పోయిన సంప్రదాయ కోర్సులు

డిగ్రీ స్థాయిలో గతంలో ఎంతో ఆదరణ ఉన్న బీఎస్సీ (ఎంపీసీ), బీఎస్సీ కంప్యూటర్స్, బీఎస్సీ (బీజెడ్సీ), బీఏ కోర్సుల్లో చేరడానికి విద్యార్థులు మాత్రం ఇప్పుడు ఇష్ట పడడం లేదు. ప్రస్తుతం డిగ్రీలో చేరిన వారిలో 50 శాతం మంది విద్యార్థులు కేవలం బీకాం బ్రాంచికి చెందినవారే కావడం గమనార్హం. కొన్ని కళాశాలలు కొత్త కోర్సులను ప్రవేశ పెట్టినా విద్యార్థుల నుంచి ఆదరణ లభించడం లేదని పలు కళాశాలల నిర్వాహకులు చెబుతున్నారు. పట్టణాల్లో లక్షల రూపాయలు అద్దెలు చెల్లిస్తూ పది, ఇరవై మంది విద్యార్థులతో కళాశాలలు నడప లేక పలు ప్రైవేట్ డిగ్రీ కళాశాలల నిర్వాహకులు మూసివేతకు సిద్ధమవుతున్నారు.

ఎంజీయూ పరిధిలో డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్ల పరిస్థితి

కళాశాలలు	సంఖ్య	మొత్తం సీట్లు	మొదటి దశలో చేరినవారు	రెండో దశలో చేరినవారు
ప్రభుత్వ	11	6,060	1,114	739
ఎయిడెడ్	02	1,260	10	69
ప్రైవేట్	49	16,680	877	790
మొత్తం	62	24,000	2,101	1,598

అంగన్‌వాడీ టీచర్ల సేవ గొప్పది



సమావేశంలో పూర్వప్రాథమిక విద్య పాఠ్యాంశాల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : అంగన్‌వాడీ టీచర్ల సేవ గొప్పదని, ఈ సెంటర్లలో చదివిన పిల్లలు వివిధ స్థాయిలో ఉండేలా తయారు చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లాలోని 70 మంది అంగన్‌వాడీ టీచర్లకు నూతన పూర్వ ప్రాథమిక విద్యపై కొనసాగుతున్న శిక్షణ తరగతుల్లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీల్లో పౌష్టికాహారంతో పాటు చదువు పట్ల మక్కువ పెరిగేలా చేసి వారు ఉన్నత స్థాయికి చేరేలా పూర్వ ప్రాథమిక విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జ్యోతి పద్మ సీడీపీఓలు, సూపర్‌వైజర్లుపాల్గొన్నారు.

ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అధికారులు అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలిసి రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమావేశాన్ని



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ఆయన మాట్లాడారు. రెవెన్యూ అంశాలతో పాటు ప్రజల సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపాలన్నారు. ప్రతి రెవెన్యూ డివిజన్‌లో రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి 20 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించాలన్నారు. రెవెన్యూ అధికారులు వారి లాగిన్‌లో ఉన్న అన్ని పిటిషన్లను పెండింగ్‌లో ఉంచుకోవద్దని, ప్రతివారం రెవెన్యూ అంశాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావు, కోదాడ ఆర్డీఓ సూర్యానారాయణ, హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాస్, సూర్యాపేట తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలులో రాజీపడొద్దు

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలులో ఎక్కడా రాజీ పడకుండా అర్హులకు అందేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్లు సి.హెచ్. ప్రియాంక, బి.ఎస్. లతతో కలిసి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పక్కా ప్రణాళికతో పారదర్శకంగా పథకాలు అమలు చేయాలన్నారు. ప్రతి మారుమూల గ్రామంలోనూ పథకాలు చేరాలన్నారు. చేపట్టిన పనులు, చేపట్టాల్సిన పనులపై ప్రజాభిప్రాయం సేకరించి ఎలాంటి సమస్యలున్నా సత్వరమే పరిష్కరించాలన్నారు. ప్రతి అధికారి సిబ్బంది పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ప్రతి పనిలో ప్రజా భాగస్వామ్యం ఉండాలన్నారు. అన్ని కార్యాలయాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం తప్పక అమలు చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఎఫ్ఓ సతీష్‌కుమార్, డీపీఓ సురేష్ కుమార్, డీఈఓ అశోక్, జిల్లాసంక్షేమాధికారిణి జ్యోతి పద్మ, సీపీఓ కిషన్ పాల్గొన్నారు.

నీట్ పేపర్ లీకేజీలో బీజేపీ నేతల హస్తం

- సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీరయ్య

పెన్‌పహాడ్: నీట్ పరీక్ష ప్రశ్నపత్రాల లీకేజీ కుంభకోణంలో బీజేపీ నాయకుల హస్తం ఉందన్న ఆరోపణలు వస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్. వీరయ్య పేర్కొన్నారు. దీనిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గురువారం పెన్‌పహాడ్ మండల కేంద్రంలో జరుగుతున్న సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. నీట్ పరీక్ష పత్రాలు బిహార్, గుజరాత్, హరియాణా రాష్ట్రాల్లో లీక్ అయినట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. పేపర్ లీకేజీ అవకతవకలపై కేంద్ర విద్యాశాఖ మంత్రికానీ ప్రధాని మోదీ కానీ నేటికీ నోరు మెదపలేదన్నారు. ఏడో విడత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా 'నేను దేవదూతను.. దేశాన్ని రక్షించేందుకు దేవుడు నన్ను పంపించాడు' అని చెప్పిన మోదీకి పేపర్ లీకేజీ తెలియకపోవడం ఆశ్చర్యంగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రధాని దేవుడైతే ఆయన పాలనలో పరీక్ష పత్రాలు లీక్ ఎందుకు అయ్యాయని ప్రశ్నించారు. 300సీట్లు సాధిస్తామని గొప్పగా చెప్పిన నరేంద్రమోదీ ప్రభుత్వం చావు తప్పి కన్ను లొట్టపోయినట్టుగా 240 సీట్లకే పరిమితం అయిందని ఆయన ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు పార్టీ కార్యక్రమం అనే క్లాసును సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీరయ్య

పి. సోమయ్య బోధించారు. సీపీఎం జిల్లా కర్తవ్యాల రిపోర్ట్‌ను పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి ప్రవేశపెట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, పారేపల్లి శేఖర్‌రావు, మట్టిపల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, మండల కార్యదర్శి రణపంగ కృష్ణ, వీరబోయిన రవి, ధనియాకుల శ్రీకాంత్ వర్మ, చినపంగి నర్సయ్య, నెమ్మాది లక్ష్మి, గుంజా వెంకటేశ్వర్లు, మడ్డి అంజిబాబు, గుర్రం గోపాల్‌రెడ్డి, కొండమీది రాములు, నెమ్మాది వీరయ్య, రమేష్, ధనియాకుల శ్రీను, గోపాల్దాసు నాగయ్య, సిరిపంగి సోమన్న, బొమ్మిరెడ్డి గోపిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం నేరేడుచర్ల–సూర్యాపేట రహదారిపై ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు.



పెన్‌పహాడ్‌లో ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

7న మాదిగల ఆత్మగౌరవ కవాతు

కోదాడరూరల్ : వచ్చేనెల 7న వరంగల్‌లో మాదిగల ఆత్మగౌరవ కవాతు నిర్వహించనున్నట్లు ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్న మాదిగ తెలిపారు. గురువారం కోదాడ పట్టణంలోని ఎంఎస్ కళాశాల ఆవరణలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ ఉప కులాలకు జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు పంపిణీ చేయాలని ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని ప్రారంభించి 30 ఏళ్లు అయిన సందర్భంగా ఈ కవాతు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు ఏపూరి రాజుమాదిగ, వడ్డెపల్లి కోటేష్ మాదిగ, సత్యరాజు మాదిగ, మిట్టగణుపుల మోషయ్య మాదిగ, కుక్కల కృష్ణ, నవీన్‌కుమార్, ఏసోబు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గంటా నాగయ్య

భానుపురి (సూర్యాపేట) : కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల ముందు కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య కోరారు. గురువారం సూర్యాపేటలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు నవీన్ అధ్యక్షతన నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల కనీస వేతనాలను పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మిక వర్గాన్ని, వారి సమస్యలను విస్మరించిందన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మూడోదఫా అధికారంలోకి రాగానే నాలుగు లేబర్ కోడ్ లను అమలు చేస్తామని ప్రకటించడాన్ని ఐఎఫ్‌టీయూ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామల్ల నవీన్, జిల్లా ఉపాధ్యక్షులు కునుకుంట్ల సైదులు, కామల్ల శ్రీను, జిల్లా సహాయ కార్యదర్శి వి. నరసింహా రావు, జిల్లా కమిటీ సభ్యులు సామ నర్సిరెడ్డి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఫిట్‌నెస్‌పై కేర్‌లెస్!



సూర్యాపేటలో స్కూల్ బస్సును తనిఖీ చేస్తున్న ఇన్‌చార్జి డీటీఓ జయప్రకాష్‌రెడ్డి



కోదాడలో బస్సును తనిఖీ చేస్తున్న ఆర్టీఏ అధికారులు

- బస్సులకు సామర్థ్య పరీక్షలు చేయించడంలో ప్రైవేట్ స్కూళ్ల నిర్లక్ష్యం
- ఎన్నిసార్లు చెప్పినా పట్టింపులేని తనం
- ఫిట్‌నెస్ పరీక్షలు చేయించని బస్సులు 149
- తనిఖీలు ముమ్మరం చేసిన ఆర్టీఏ అధికారులు
- ఇప్పటి వరకు 12 బస్సులు సీజ్

సూర్యాపేటటౌన్ : ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయి. ఫిట్‌నెట్ లేకుండా బస్సులు నడిపితే కేసులు నమోదు చేయడంతోపాటు సీజ్ చేస్తామని ఆర్టీఏ అధికారులు హెచ్చరించినా పెడచెవిన పెడుతున్నాయి. స్కూళ్లు తెరిచి 10రోజులు కావొస్తున్నా జిల్లాలో ఇంకా 149 బస్సులకు ఫిట్‌నెట్ పరీక్షలు చేయించలేదు.

జిల్లాలో 515 స్కూల్ బస్సులు

జిల్లాలో ప్రైవేట్ విద్యా సంస్థల బస్సులు 515 ఉన్నాయి. వీటిలో విద్యాసంస్థల యాజమాన్యాలు ఇప్పటి వరకు 366 బస్సులకు మరమ్మతులు చేయించి ఆర్టీఏ కార్యాలయానికి తీసుకొని వచ్చాయి. కాగా అధికారులు బస్సుల్లో ప్రథమ చికిత్స పెట్టె, వాహన కండీషన్, టైర్లు, సీట్లు, ఫుట్ బోర్డు, లైట్లు, రేడియం, ఇంజిన్ కండీషన్, బ్రేకుల కండీషన్ ఇవన్నీ తనిఖీ చేసి సర్టిఫికెట్లు అందజేశారు. ఇంకా 149 బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాల్సి ఉంది. అయితే ఇందులో 15ఏళ్లు దాటిన బస్సులు ఉండొచ్చని ఆర్టీఏ అధికారులు చెబుతున్నారు. 15ఏళ్లు దాటితే స్కూల్ బస్సులకు అనుమతి ఉండదని, వాటికి ఫిట్‌నెస్ పరీక్షలు చేయబోమని అధికారులు పేర్కొంటున్నారు.

12 బస్సులపై కేసు నమోదు

జిల్లాలో పాఠశాలలు పునఃప్రారంభమైన రోజు నుంచి రోజూ అధికారులు సూర్యాపేట, కోదాడ ఆర్టీఏ పరిధిలో తనిఖీలు ముమ్మరం చేశారు. ప్రైవేట్ స్కూళ్ల బస్సులు ఫిట్‌నెస్ లేకుండా పిల్లలను తీసుకెళ్తే తనిఖీ చేసి కేసు నమోదు చేసి సీజ్ చేస్తున్నారు. ఇప్పటి వరకు 12 బస్సులపై కేసులు నమోదు చేసి సీజ్ చేసినట్టు తెలిపారు.

నిబంధనలు పాటించకపోతే కేసులు



ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు కచ్చితంగా తమ బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలి. జిల్లాలో ఇంకా 149 వరకు ఫిట్‌నెస్‌కు రాని బస్సులు ఉన్నాయి. వారు వెంటనే వచ్చి బస్సులకు ఫిట్‌నెస్ చేయించుకొని అర్హత సర్టిఫికెట్ పొందాలి. ఫిట్‌నెస్ లేకుండా రోడ్లపై తిప్పితే కేసులు నమోదు చేసి బస్సు సీజ్ చేస్తాం. 15ఏళ్లు దాటిన బస్సులను పాఠశాల విద్యార్థుల కోసం తిప్పవద్దు.

– ఎస్.జయప్రకాష్‌రెడ్డి, ఇన్‌చార్జి, డీటీఓ, సూర్యాపేట

క్లుప్తంగా

ఐక్యరాజ్యసమితి విధులకు ఎంపికైన హెడ్ కానిస్టేబుల్


యాదగిరి

యాదగిరిగుట్ట రూరల్ (ఆలేరు రూరల్): ఆలేరు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హెడ్ కానిస్టేబుల్ చొగాని యాదగిరి ఐక్యరాజ్య సమితి ద్వారా వివిధ దేశాల్లో నియమించే 'శాంతి కమిటీ' విధుల నిర్వహణకు ఎంపికయ్యారు. న్యూయార్క్ నుంచి వచ్చిన యునైటెడ్ నేషన్స్ మిషన్ టీమ్ ఆధ్వర్యంలో ఢిల్లీలో జూన్ 6వ తేదీ నుంచి 17 వరకు డ్రైవింగ్, ఫైరింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షల్లో యాదగిరి ఉత్తీర్ణులైనట్లు గురువారం తెలిపారు. ఎంపికైన వారు.. శాంతిభద్రతలు అస్తవ్యస్తంగా ఉన్న దేశాల్లో ఐరాస సూచించిన విధంగా విధులు నిర్వర్తిస్తారు. ఏడాది పాటు తమ విధులు ఉంటాయని, అంతర్జాతీయంగా పోలీస్ వ్యవస్థ ఎలా ఉంటుందో తెలుసుకోవచ్చని యాదగిరి చెప్పారు. అంతర్జాతీయ గుర్తింపు కోసమే తాను వెళుతున్నానని పేర్కొన్నారు. నకిరేకల్ మండలం పాలెం గ్రామం యాదగిరి స్వస్థలం, 1995లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. అప్పటి నుంచి తుర్కపల్లి, బొమ్మలరామారం, రాజాపేట, భువనగిరి, మోటకొండూర్, కీసర, ఆలేరు ప్రాంతాల్లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించారు. 2022లో హెడ్ కానిస్టేబుల్‌గా ఈయనకు ప్రమోషన్ లభించింది. ఆలేరులో మూడు నెలల నుంచి హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో చొగాని యాదగిరితో పాటు ఏసీపీ రమేష్ కూడా ఎంపికయ్యారు.

8 కిలోల గంజాయి పట్టివేత

- ముగ్గురి అరెస్ట్.. అందులో ఒకరు మైనర్


వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట డీఎస్పీ రవి

సూర్యాపేటటౌన్: సూర్యాపేట జిల్లా కేంద్రంలో గురువారం పోలీసులు ఎనిమిది కిలోల గంజాయి పట్టుకొని ముగ్గురిని అరెస్ట్ చేశారు. సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఈ కేసుకు సంబంధించిన వివరాలను సూర్యాపేట డీఎస్పీ రవి విలేకరులకు వెల్లడించారు. వివరాల.. గురువారం ఉదయం సూర్యాపేట పట్టణంలోని ఖమ్మం రోడ్డులో గల అమ్మ గార్డెన్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో సూర్యాపేట పట్టణంలోని చింతలచెరువుకు చెందిన కోడిదల పవన్‌కుమార్, మన్నె రాహుల్‌తో పాటు శ్రీరామ్‌నగర్‌కు చెందిన బాలుడు పల్సర్ బైక్‌పై వస్తున్నారు. వారిని పోలీసులు ఆపతుండగా పారిపోయేందుకు ప్రయత్నించారు. వెంటనే పోలీసులు చేజ్ చేసి పట్టుకుని తనిఖీ రెండు బ్యాగులలో ఎనిమిది కిలోల గంజాయి పట్టుబడింది. పవన్, బాలుడు కలిసి ఖమ్మం నుంచి ట్రైన్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అరకు ప్రాంతానికి వెళ్లి గంజాయి కొనుగోలు చేసి ఖమ్మం తీసుకొచ్చారు. రాహుల్ తన బైక్‌పై ఖమ్మం వెళ్లి వారిని సూర్యాపేటకు తీసుకొస్తుండగా పట్టుబడినట్లు డీఎస్పీ తెలిపారు. ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. గంజాయి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించిన పట్టణ సీఐ రాజశేఖర్, ఎస్‌ఐలు మహేంద్రనాథ్, బి. కుశలవ, క్రైం హెడ్‌కానిస్టేబుల్స్ కృష్ణ, కరుణాకర్, సైదులు, కానిస్టేబుళ్లు ఆనంద్, మధును డీఎస్పీ అభినందించారు.

ఇద్దరు సారా విక్రేతల అరెస్ట్

కొండమల్లేపల్లి: ఇద్దరు సారా విక్రేతలను గురువారం ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. కొండమల్లేపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో మండల పరిధిలోని ఆంగోతుతండాకు చెందిన వ్యక్తి వద్ద ఐదు లీటర్ల సారాని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. అదేవిధంగా దేవరకొండలో ఓ మహిళ నాలుగు లీటర్ల సారాని అమ్ముతుండగా ఆమెను అదుపులోకి తీసుకొని సారాని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ వీరబాబు, మల్లేశ్, నరసింహ, సిబ్బంది పాల్గొన్నారు.



ఆరోగ్య సూత్రం.. యోగా మంత్రం

- క్రమం తప్పకుండా యోగా చేస్తే రోగాలు దూరం
- యోగాపై యువతలోనూ పెరుగుతున్న ఆసక్తి
- చిన్న పట్టణాల్లోనూ విస్తరిస్తున్న యోగా శిక్షణ కేంద్రాలు

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

నల్లగొండ టూటౌన్, హాలియా: దైనందిన జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులు, ఒత్తిళ్ల కారణంగా చాలా మంది బీపీ, షుగర్, థైరాయిడ్, ఉబకాయం, ఆస్తమా, నరాల బలహీనత వంటి అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. దీంతో ఆస్పత్రుల చుట్టూ తిరిగి వేల రూపాయలు ఖర్చుచేసినా వచ్చిన రోగాలు మాత్రం పూర్తిగా నయం కావడం లేదు. ఇలాంటి రోగాలు, రుగ్మతలను జయించాలంటే నిత్యం యోగా సాధన చేయాలని యోగా గురువులు చెబుతున్నారు. క్రమం తప్పకుండా ప్రతిరోజు అరగంట నుంచి గంట వరకు యోగాసనాలు వేయడం ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు రోగనిరోధక శక్తి పెరిగి ఎటువంటి రోగాలు దరిచేరవని పేర్కొంటున్నారు. యోగాసనాలు


యోగాసనాలు సాధన చేస్తున్న యువకుడు

వేయడం వలన అన్ని శరీర భాగాలు కదులుతూ శరీరంలో ఎలాంటి కఠినమైన సమస్య వచ్చినా ఎదుర్కోవడానికి సన్నద్ధం కావొచ్చని వివరిస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపుతో యోగా, వ్యాయామంపై ప్రజల్లో ఆసక్తి పెరిగింది. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు వ్యాయామం ఒక్కటే మార్గమని భావించిన ప్రజలు రోజులో కొంత సమయాన్ని యోగసనాల కోసం వెచ్చిస్తున్నారు. ఒకప్పుడు నగరాలకు పరిమితమైన యోగా శిక్షణ కేంద్రాలు, వ్యాయామ కేంద్రాలు, జాగింగ్ సంస్కృతి ఇప్పుడు చిన్న చిన్న పట్టణాలు, గ్రామాలకు విస్తరిస్తోంది.


నల్లగొండలో ఆసనాలు వేస్తున్న యోగా సాధకులు

పట్టణాల్లోనూ యోగా శిక్షణ కేంద్రాలు..

నల్లగొండ పట్టణానికి చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి రాపోలు వెంకటేశ్వర్లు గత 20 సంవత్సరాలుగా ఉచితంగా యోగా శిక్షణ ఇస్తున్నారు. ఆయన వద్ద యోగా నేర్చుకున్న పలువురు యోగా సాధకులు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చారు. అదేవిధంగా నాగార్జున సాగర్ నియోజకవర్గంలోని హాలియా పట్టణానికి చెందిన పతంజలి యోగా గురువు జాని గత 12 ఏళ్లుగా ప్రతిరోజు ఉదయం 5గంటల నుంచి 6గంటల వరకు యోగాపై శిక్షణ ఇస్తున్నారు. అంతేకాకుండా త్రిపురారం మండల కేంద్రంలోని సత్యసాయి ధ్యాన మండలి ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. యోగాసనాలు వేసేందుకు వృద్ధులు, చిన్నారులు, యువకులు క్యూ కడుతున్నారు. నిత్యం యోగా చేయడం వల్ల బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, మోకాళ్ల నొప్పులు, ఉబకాయం, ఒంటి నొప్పులు, హైపర్ టెన్షన్, నిద్ర పట్టకపోవడం, ఎసిడిటి తదితర రోగాలు నయమై మంచి ఫలితాలు వస్తాయని యోగా గురువులు చెబుతున్నారు.

కుటుంబమంతా యోగా చేస్తున్నాం



గత ఐదు సంవత్సరాలుగా యోగా సాధన చేస్తున్నాం. మా ఇద్దరు పిల్లలతో పాటు కుటుంబ సభ్యులందరం యోగా ఆసనాలు వేస్తున్నాం. నా భర్తకు ఆస్తమా ఉంటే పూర్తిగా తగ్గిపోయింది. కరోనా వచ్చినా తట్టుకొని నిలబడగలిగాం.
– శ్రీదేవి, యోగా సాధకురాలు, నల్లగొండ

బీపీ, షుగర్ నియంత్రణలో ఉంది



నేను వెన్నునొప్పితో తీవ్ర ఇబ్బందులు పడ్డాను. గత 15 సంవత్సరాలుగా బీపీ, షుగర్ కూడా ఉంది. మంతెన సత్యనారాయణ ఆశ్రమంలో 15 రోజులు ఉండి ఆహార నియామాలు పాటిస్తూ ప్రతిరోజు యోగా చేయడంతో వెన్నునొప్పి తగ్గి, షుగర్, బీపీ నియంత్రణలో ఉంది.
– ఎండీ. షరీఫ్, యోగా సాధకుడు, నల్లగొండ

జాతీయస్థాయి పోటీలకు వెళ్లాను



నేను పత్తి బోరం ఎత్తుకోవడంతో స్పాన్‌లైసెస్ (సర్వైకల్) ఆపరేషన్ అయింది. తల కాయ పైకి కూడా లేవలేదు. వైద్యులు, కొందరి సలహాలతో ప్రతిరోజు యోగా చేయడం ద్వారా సమస్య పూర్తిగా తొలగిపోయింది. రెండు సార్లు జాతీయ స్థాయి యోగా పోటీలకు కూడా వెళ్లాను.
– సింగం ప్రవీణ్, యోగా సాధకుడు, నల్లగొండ

20ఏళ్లుగా ఉచితంగా యోగా శిక్షణ



గత 20 ఏళ్లుగా ఉచితంగా యోగా శిక్షణ ఇస్తున్నాను. యోగా వలన ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండవచ్చు. జీర్ణక్రియ పెరిగి రోగాన్ని తట్టుకొనే శక్తి పెరుగుతుంది. నిగ్రహంగా ఉండి బరువు తగ్గవచ్చు. మన శరీరం తమ ఆధీనంలోకి వస్తుంది.
– రాపోలు వెంకటేశ్వర్లు, సీనియర్ యోగా గురువు, నల్లగొండ

రుగ్మతలు దరిచేరవు



మనకు ఎంత పని ఉన్నా నిత్యం యోగాసనాలు తప్పకుండా వేయాలి. అప్పుడే ఉల్లాసంగా, హుషారుగా ఉంటాం. ఎలాంటి రుగ్మతలు వచ్చినా తట్టుకుని నిలబడే శక్తి వస్తుంది. మానసిక ప్రశాంతత పొందవచ్చు.
– తేలుకుంట్ల శ్రీనివాస్, యోగా సాధకుడు, నల్లగొండ

మానసిక ప్రశాంతత లభిస్తుంది



సమాజంలో యోగాపై ఆసక్తి పెరిగింది. వయసుతో సంబంధం లేకుండా యోగా చేయవచ్చు. నిరంతరం యోగా, సూర్యనమస్కారాలు చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారు. ప్రతిఒక్కరూ రోజులో కొంత సమయాన్ని వెచ్చించి యోగా చేస్తే వ్యాధులన్నీ దూరమై, మానసిక ప్రశాంతత లభిస్తుంది.
– ధూళిపాల గోవర్ధన్, యోగా గురువు, త్రిపురారం


యోగా సాధన చేస్తున్న చిన్నారి

నర్సింహాపురంలో ఉద్రిక్తత


కంటైనర్ లోపల స్వీయ నిర్బంధంలో మాలె సతీష్‌రెడ్డి దంపతులు


కంటైనర్ బయట పురుగు మందు డబ్బాతో మాలె శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులు

- భూ వివాదం కారణంగా పురుగు మందు డబ్బాలతో ఇరు వర్గాల నిరసన
- భూమి సర్వే చేయించి న్యాయం చేస్తామని పోలీసుల హామీ

నకిరేకల్: భూ వివాదానికి సంబంధించి ఇరువర్గాల వారు పురుగుల మందు డబ్బాలతో నిరసనకు దిగడంతో నకిరేకల్ మండలం నర్సింహాపురం గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. నర్సింహాపురం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు మాలె సతీష్‌రెడ్డి భార్య సరితారెడ్డికి వారసత్వంగా వచ్చిన 2.06 ఎకరాల భూమి అన్యాక్రాంతమైందని, ఆ భూమి తమదే అని పది రోజుల క్రితం నివాసయోగ్యమైన కంటైనర్‌ను తెచ్చి ఆ భూమిలో వేసుకున్నారు. భార్యాభర్తలు ఇద్దరూ కంటైనర్‌లోకి వెళ్లి తాళం వేసుకుని స్వీయ నిర్బంధంలో ఉండి నిరసనకు దిగారు. తమకు న్యాయం జరగకపోతే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని భీష్మించుకు కూర్చున్నారు. అయితే ఆ భూమి తమదే అని గురువారం అదే గ్రామానికి చెందిన మాలె శ్రీనివాస్‌రెడ్డి, శిరీష దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పురుగుల మందు డబ్బాతో వచ్చి కంటైనర్ ఎదుట నిరసనకు దిగారు. 60ఏళ్ల క్రితం సతీష్‌రెడ్డి పూర్వీకులు తమకు ఆ భూమిని విక్రయించారని, ఇప్పుడు వచ్చి అమ్మిన భూమి కావాలని ఆందోళన చేయడం ఎంతవరకు సమంజసమని శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నిస్తున్నారు. విషయం తెలుసుకున్న నకిరేకల్ సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ గోపికృష్ణ, తహసీల్దార్ జమీరొద్దీన్ తమ సిబ్బందితో వచ్చి ఇరువర్గాల వారితో చర్చించినా సమస్య కొలిక్కి రాలేదు. భూమి సర్వే చేయించి ఎవరికి రావాల్సిన భూమిని వారికి అప్పగిస్తామనని హామీ ఇచ్చినప్పటికీ స్వీయ నిర్బంధంలో ఉన్నవారు అంగీకారానికి రావడంలేదు. కాగా ఆ ప్రదేశంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇరువర్గాల వారు నిరసన తెలుపుతున్న కంటైనర్ వద్ద పోలీసులు పహారా కాస్తున్నారు.

తప్పు ఎవరిదో ప్రజలే నిర్ణయిస్తారు

- నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి


కేక్ కట్ చేస్తున్న ఎంపీ రఘువీర్‌రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి తదితరులు

భానుపురి (సూర్యాపేట): ఛత్తీస్‌గడ్ విద్యుత్ ఒప్పందంపై బీఆర్‌ఎస్ నాయకుల వద్ద ఉన్న ఆధారాలు, కాంగ్రెస్ నాయకుల వద్ద ఉన్న ఆధారాలు చూపితే తప్పు ఎవరిదో.. ఎవరిని చెప్పులతో కొట్టాలో ప్రజలే నిర్ణయిస్తారని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డితో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 24, 25వ తేదీల్లో జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీగా ప్రమాణస్వీకారం చేసే సీనియర్ నేత రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఆశీర్వాదం కోసం వచ్చానని అన్నారు. సూర్యాపేట నియోజకవర్గంలో 70వేల మెజార్టీ తీసుకొచ్చిన దామోదర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. సూర్యాపేట నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను దామోదర్‌రెడ్డి తన దృష్టికి తీసుకొచ్చారని, అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆదరణ తగ్గిందని తప్పుడు ప్రచారాలు చేసిన మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డికి పార్లమెంట్ ఎన్నికల్లో తమ ఓటుతో ప్రజలే బుద్ధి చెప్పారన్నారు. కనీసం డిపాజిట్లు రాకుండా చేశారని తెలిపారు. ప్రజలు, ప్రజా సమస్యలపై మాట్లాడడం మానేసి కాంగ్రెస్ నాయకులను చెప్పుతో కొడతామంటూ మాజీ మంత్రి మాట్లాడడం సరైంది కాదని తెలిపారు. ఛత్తీసగడ్ కరెంట్ ఒప్పందంపై జ్యుడీషియల్ కమిషన్ వేస్తే కమిషన్‌నే తప్పుపట్టడం, ప్రశ్నించడాన్ని ప్రజలంతా గమనిస్తున్నారని తెలిపారు. రానున్న లోకల్ బాడీ ఎన్నికల్లో సైతం ప్రజలు కాంగ్రెస్ నాయకులను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. జిల్లా మంత్రులను, ప్రభుత్వాన్ని సమన్వయం చేసుకొని ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుకెళ్తానని తెలిపారు. అనంతరం జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు కొప్పుల వేణారెడ్డి, చకిలం రాజేశ్వర్‌రావు, కక్కిరేణి శ్రీనివాస్, అంజద్‌అలీ, తదితరులు పాల్గొన్నారు.

కిషోర్‌కుమార్‌కు జాతీయ సేవారత్న అవార్డు


అవార్డు అందుకుంటున్న పల్లె కిషోర్‌కుమార్

నల్లగొండ టౌన్: నల్లగొండ పట్టణానికి చెందిన జనయేత్రి ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త, ఏఎస్‌ఐ పల్లె కిషోర్‌కుమార్ మానవ హక్కుల పరిరక్షణ ప్రజాసమితి వారి జాతీయ సేవారత్న అవార్డుకు ఎంపికయ్యారు. పల్లె కిషోర్‌కుమార్ కళారంగంతో పాటు వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను మానవ హక్కుల పరిరక్షణ ప్రజాసమితి ఈ అవార్డును ఆయనకు అందజేసింది. గురువారం ఖమ్మంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ కవి, సినీ రచయిత కావూరి శ్రీనివాస్‌శర్మ చేతులమీదుగా కిషోర్‌కుమార్ సేవారత్న అవార్డుతో పాటు సన్మానపత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పుడమి సాహితీ వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిలుముల బాల్‌రెడ్డి, సినీ డైరెక్టర్ మాగంటి ప్రసాద్‌బాబు, నటులు మాగంటి శ్రీధర్‌బాబు, దేవిరెడ్డి శశినాయుడు, మానవ హక్కుల పరిరక్షణ ప్రజాసమితి జాతీయ చైర్మన్ డాక్టర్ ధ్యానసుందరి, డాక్టర్ చలమల హైమావతి తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య

మిర్యాలగూడ: ఉరేసుకుని యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దామరచర్ల మండల కేంద్రంలో గురువారం జరిగింది. వివరాలు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన దొడ్ల సురేష్ దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఉద్యోగిగా పనిచేస్తూ దామరచర్లలోనే నివాసం ఉంటున్నాడు. అతనితో పాటు పాల్వంచకు చెందిన ప్రియాంక(34) అనే యువతితో కలిసి ఉంటున్నట్లు తెలిసింది. కొంతకాలంగా సురేష్, ప్రియాంకల మధ్య గొడవలు జరుగుతుండడంతో మనస్తాపానికి గురైన ప్రియాంక గురువారం వారు ఉంటున్న ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సురేష్ గమనించి ప్రియాంకను చికిత్స నిమిత్తం మిర్యాలగూడలోని ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్‌కు సమాచారం అందించగా అక్కడికి చేరుకున్న సిబ్బంది ప్రియాంక అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రియాంక మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సురేష్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేపట్టారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

సకాలంలో స్పందించిన పోలీసులు

- ఛాతినొప్పితో అస్వస్థతకు గురైన లారీ డ్రైవర్
- చౌటుప్పల్‌లో పెట్రోలింగ్ పోలీసులకు తెలపడంతో వెంటనే ఆస్పత్రికి తరలింపు

చౌటుప్పల్: డ్రైవింగ్ చేస్తున్న సమయంలో ఛాతిలో నొప్పి రావడంతో అస్వస్థతకు గురైన లారీ డ్రైవర్‌ను పోలీసులు సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రాణాలు కాపాడారు. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన చెల్లి వెంకటరమణ(55)తో పాటు అతడి కుమారుడు అర్జున్‌కుమార్ కలిసి రాజమండ్రిలో లారీ లోడ్ చేసుకొని బుధవారం సాయంత్రం హైదరాబాద్‌కు బయల్దేరారు. మార్గమధ్యలో బుధవారం అర్ధరాత్రి దాటాక నల్లగొండ జిల్లా చిట్యాల గ్రామ శివారులో వెంకటరమణకు ఛాతిలో నొప్పి మొదలయ్యింది. అర్ధరాత్రి కావడంతో ఎక్కడా ఆస్పత్రులు అందుబాటులో లేవు. ఏదోవిధంగా అర్ధరాత్రి 2.30గంటలకు చౌటుప్పల్‌కు చేరుకున్నారు. అదే సమయంలో తంగడపల్లి చౌరస్తా వద్ద పెట్రోలింగ్ వాహనం కనిపించడంతో తమ లారీని రోడ్డు పక్కన ఆపారు. వెంటనే అక్కడికి వెళ్లి డ్యూటీలో ఉన్న పెట్రోలింగ్ పోలీసులు నాగరాజు, వెంకటేశంను కలిసి విషయం చెప్పారు. స్పందించిన పోలీసులు బాధితుడిని తమ వాహనంలోనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యుడు గుండెపోటుగా గుర్తించారు. ప్రాథమిక చికిత్స నిర్వహించి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. బాధితుడి కుమారుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు.

టీజీ పీఈసెట్‌లో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు


చిట్టిమల్ల సంధ్య

మోటకొండూర్: ప్రతిభకు పేదరికం అడ్డుకాదని మోటకొండూర్ మండలం అమ్మనబోలు గ్రామానికి చెందిన చిట్టిమల్ల సంధ్య నిరూపించింది. గురువారం విడుదలైన తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(టీజీ పీఈసెట్-2024) ఫలితాల్లో ఆమె రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్ సాధించింది. నిరుపేద కుటుంబానికి చెందిన సంధ్య పదో తరగతి వరకు అమ్మనబోలులోని ప్రభుత్వ పాఠశాలలోనే సాగింది. సంధ్యకు చిన్నతనం నుంచే ఆటల పట్ల ఉన్న మక్కువ 6వ తరగతిలో తమ పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న గడసంతల మధుసూదన్ ప్రోత్సాహంతో మరింత పెరిగింది. దీంతో ఆమె చిన్నప్పటి నుంచి స్కూల్ గేమ్స్, ఇతర పోటీల్లో పాల్గొని అనేక పతకాలను సాధించింది. ఇంటర్మీడియట్ ఆలేరులోని వెంకటరమణ జూనియర్ కళాశాలలో పూర్తిచేసింది. భవిష్యత్తులో పోలీస్ ఉద్యోగం సాధించాలనే కోరిక ఉన్నట్లు సంధయ్య పేర్కొంది. ఆమెను తల్లిదండ్రులు, గ్రామస్తులు, వ్యాయామ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

బొమ్మలరామారం: మండలంలోని పెద్దపర్వతాపూర్ గ్రామ శివారులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపర్వతాపూర్ గ్రామ శివారులోని చింతలకుంట సమీపంలో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని డాగ్ స్క్వాడ్‌ను పిలిపించారు. మృతుడి వయస్సు సుమారు 40 నుంచి 50 సంవత్సరాలు ఉంటుందని, పెసరు రంగు టీషర్టు, నైట్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, నాలుగైదు రోజుల క్రితం మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. భువనగిరి రూరల్ సీఐ ప్రభాకర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పెద్దపర్వతాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి రవీందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తే గుణపాఠం తప్పదు

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

యాదగిరిగుట్ట: ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వాలకు గుణపాఠం తప్పదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. యాదగిరిగుట్టలో జరుగుతున్న దళిత హక్కుల పోరాట సమితి మూడురోజుల శిక్షణ తరగతుల ముగింపు సమావేశానికి గురువారం ఆయన హాజరై మాట్లాడారు. దేశంలో ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని విస్మరించడం కారణంగానే నిరుద్యోగం, పేదరికం, ఆకలి చావులు పెరిగిపోతున్నాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో దేశంలో బడుగు బలహీన వర్గాలు, దళితులు, ఆదివాసీలు, గిరిజనులకు సంక్షేమ ఫలాలు అందకుండా పోతున్నాయన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం దళిత బంధు పథకాన్ని అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. బాల్‌నర్సింహ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం నిధులను దళితుల అభివృద్ధికి ఉపయోగించకుండా ప్రభుత్వాలు ప్రతిసారి దారి మళ్లిస్తున్నాయన్నారు. దేశంలో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై అనేక రకాలుగా దాడులు జరుగుతున్నాయని అన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగ ఫలాలు దళితులకు, అట్టడుగు వర్గాలకు అందించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరుపాక అనిల్‌కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, బోలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు క్లెం కృష్ణ, ఏశాల అశోక్, చెక్క వెంకటేష్, ఎండీ ఇమ్రాన్, బండి జంగమ్మ, జిల్లా సమితి సభ్యులు బబ్బూరి శ్రీధర్, సీపీఐ మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, తాళ్లపల్లి లక్ష్మణ్, గోరేటి రాములు, కాశపాక దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

'నీట్' పై సమగ్ర విచారణ జరిపించాలి..

అనంతరం చాడ వెంకట్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. నీట్ పరీక్షపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. హర్యానాలో ఆరుగురికి 720 మార్కులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. బిహార్‌లో పేపర్లు అమ్ముకున్నట్లు బయటపడిందని తెలిపారు. విద్యార్థులు చేస్తున్న ఉద్యమానికి తమ పార్టీ మద్దతు ఉంటుందన్నారు. దేశంలో నరేంద్ర మోదీ మతోన్మాద, కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ అహంకారంతోనే బీఆర్‌ఎస్ ఓడిపోయిందన్నారు. గతంలో వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రజా దర్బార్ పేరుతో ప్రజలను కలిశారని, అదే తరహాలో ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను తెలుసుకోవాలన్నారు. ప్రతిపక్షాలను, ప్రజా సంఘాలను కలుపుకుపోవాలన్నారు. సాగుచేసే భూములకు రైతు బంధు ఇవ్వాలని, రైతు బంధు లిమిటేషన్‌పై అందరి సలహాలు తీసుకోవాలన్నారు.